క్లుప్తంగా

ఫీవర్ సర్వే పక్కాగా చేపట్టండి



ఫీవర్ సర్వేపై సూచనలిస్తున్న డాక్టర్ నగేష్

మద్దికెర: ఫీవర్ సర్వే పక్కాగా నిర్వహించడంతో పాటు దోమ కాటు వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ప్రభుత్వ వైద్యాధికారి నగేష్, మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశులు సూచించారు. వారు సోమవారం మద్దికెరలో పర్యటించారు. దోమ కాటు వల్ల కలిగే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి జ్వరం ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆస్పత్రుల్లో చికిత్స పొందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల పరిసరాలలో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తొట్లు, డబ్బాలు, టైర్లు, వర్షపునీరు నిల్వ ఉండడం వల్ల దోమలు ఉత్పత్తి అయి రోగాలకు కారణమవుతాయన్నారు. తగు జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాష హెల్త్ అసిస్టెంట్ ప్రకాష్‌రావు ఉన్నారు.

14న అభయాంజనేయ స్వామి రథోత్సవం

తుగ్గలి:హనుమాన్ జయంతి పురస్కరించుకొని ఈనెల 14న పగిడిరాయిలో అభయాంజనేయ స్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు సోమవారం గ్రామస్తులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలశస్థాపన, అంకురార్పణ, ధ్వజారోహణ, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఉత్సవం సందర్భంగా 14, 15 తేదీల్లో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రోడ్డును సకాలంలో పూర్తి చేస్తాం

ఆలూరు: చిప్పగిరి మండలం గుమ్మనూరు, ఖాజీపురం, కొట్టాల గ్రామాల మధ్య రూ.5 కోట్లతో జరుగుతున్న బీటీ రోడ్డు పనులను సకాలంలో సంబంధిత కాంట్రాక్టర్ చేత పూర్తి చేయిస్తామని పీఆర్ డీఈ శ్రీరాములు స్పష్టం చేశారు. సోమవారం ఆయన రోడ్డు పనులను పరిశీలించారు.డీఈ మాట్లాడుతూ.. రోడ్డు అందుబాటులోకి వస్తే ఇక్కడి ప్రజలు అనంతపురం జిల్లా గుంతకల్లు, బళ్లారి, ఆలూరు, ఆదోని తదితర పట్టణ కేంద్రాలకు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. ప్రస్తుతం రోడ్డు మార్గంలో నాలుగు కల్వర్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.

కౌలు రైతులకు పంటసాగు హక్కు పత్రం

మద్దికెర: భూ యజమానుల నుంచి పొలం కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్న రైతులకు పంట సాగు పత్రాలు మంజూరు చేస్తామని ఏఓ హేమలత పేర్కొన్నారు. సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో పంటసాగు హక్కు పత్రం, ఉపయోగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంట సాగు హక్కు పత్రం ఉంటే పంట నమోదు, రైతు భరోసా, పంట నష్ట పరిహారం, వ్యక్తిగత పరికరాలు, సబ్సిడీ విత్తనాలు పొందవచ్చన్నారు. కౌలు రైతులు భూయజమాని, కౌలు రైతు ఆధార్ కార్డు, సర్వే నంబర్, విస్తీర్ణ వివరాలు, అగ్రిమెంట్ పత్రం అందజేసి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ సహాయకులు జాకీర్, ఆనంద్, రాణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌పై శిక్షణ



తుగ్గలిలో లోకోస్ శిక్షణలో మాట్లాడుతున్న వైకేపీ ఏపీఎం రాధాకృష్ణ

తుగ్గలి: పొదుపు సంఘాల ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోకోస్ యాప్‌పై సోమవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో వీఓఏలకు శిక్షణ ప్రారంభమైంది. వైకేపీ సీసీలు వీఓఏలకు శిక్షణ ఇచ్చారు. ఏపీఎం రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఇప్పటివరకు సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో పొదుపు సంఘాల సమావేశాలు, ఆర్థిక లావాదేవీలను మొబైల్ బుక్ కీపింగ్ ద్వారా నమోదు చేసేవారన్నారు. ఇకపై వీఓఏలు బాధ్యతగా లోకోస్ యాప్‌లో వీఓఏలు సంఘాల వివరాలు, ఆర్థిక లావాదేవీలు నమోదు చేయాల్సి ఉందన్నారు.

లావాదేవీలు పక్కాగా నమోదు చేయండి

మద్దికెర: మహిళల పొదుపునకు సంబంధించి లావాదేవీల సమాచారాన్ని లోకోస్ యాప్‌లో సక్రమంగా పొందుపరచాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సూర్యప్రకాష్ అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో మండలంలోని వీబీకేలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ గతంలో పొదుపునకు సంబంధించి సమాచారాన్ని మొబైల్ బ్యాంకింగ్‌లో చేసేవారమన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నూతనంగా తయారుచేసిన లోకోస్ (ప్రజల ఆపరేషన్ సిస్టం) యాప్‌లో బ్యాంకింగ్ లావాదేవీలను జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



చందోలి గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: పేద ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చందోలి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే శ్రీదేవి పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామస్తులు సీసీ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని విన్నవించగా సాను కూలంగా స్పందించిన ఎమ్మెల్యే స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ నారాయణదాస్, చందోలి గ్రామ నాయకులు కృష్ణారెడ్డి, రవిరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రామన్న, బాలన్న, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ అధికార ప్రతినిధి శ్రీరంగడు, మండల కన్వీనర్ కారం నాగరాజు, కేశవరెడ్డి, నీలకంఠ, పులికొండ తిప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

మంత్రాలయం రూరల్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. మంత్రాలయం మండల పరిధిలోని పి.తాండ గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో ఏఏ పథకాలు అందాయనే అంశాలను వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. గ్రామంలోని ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. ఎస్ఐ కిరణ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, గ్రామ ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తదితరులు ఉన్నారు.

పుస్తకాలతో దోస్తీ కట్టండి



సమ్మర్‌క్యాంపును ప్రారంభిస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి, నాగరత్నమ్మ

వెల్దుర్తి: వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా మంచి పుస్తకాలను చదవాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తిరివీధి సాయి ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవితాబాయితో కలిసి ఆయన సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. మొదటి రోజు గ్రంథాలయానికి విచ్చేసిన చిన్నారులతో కలిసి ముచ్చటించారు. గ్రంథాలయంలో పలు పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఉపయోగించుకోవాలని సూచించారు.

నందవరం: విద్యార్థులు గ్రంథాలయం నిర్వహించే వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని శాఖ గ్రంథాలయ అధికారి శివరామప్రసాద్ సూచించారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు చలువాది బదిరీ నారాయణ చేతుల మీదుగా చదవడం మాకిష్టం కార్యక్రమం ద్వారా వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ..ఈ నెల 8 నుంచి వచ్చే నెల 11వరకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి చలువాది రమేష్ పాల్గొన్నారు.

పత్తికొండటౌన్: వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞానం పెంపొందించుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా సమ్మర్‌క్యాంపు ఏర్పాటు చేయడం హర్షణీయం అని మాజీ ఎంపీపీ ఎస్.నాగరత్నమ్మ, ఎంఈఓ మస్తాన్‌వలి అన్నారు. సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వారు వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు.చిన్నారులు వేసవి సెలవులను వృథా చేసుకోకుండా గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన శిబిరానికి హాజరై విజ్ఞానంతో పాటు వినోదం పొందాలని సూచించారు. గ్రంథాలయాధికారి రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

ఆలూరు రూరల్: వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల్లో విజ్ఞాన శిబిరాల ఏర్పాటుకు ఆదేశాలిచ్చింది. ఇందులో భాగంగానే సోమవారం ఆలూరు, మొలగవల్లి గ్రామాల్లోని గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభించినట్లు గ్రంథాలయాల అధికారులు వెంకటేశ్వర్లు, భాస్కర్ తెలిపారు. పుస్తక పఠనం, కథలు, స్వాతంత్య్ర సమరయోధులు, మహనీయుల చరిత్రపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. వచ్చే జూన్ నెల 11వ తేదీ వరకు రోజు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

గోనెగండ్ల: మండల పరిధిలోని బి.అగ్రహారంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు రాజేష్, రామనాయుడు, పెద్దయ్య కోరారు. ఈ మేరకు సోమవారం గ్రామస్తులతో కలిసి గ్రామ సచివాలయంలో ఉద్యోగి హనుమంతుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. రాత్రి పగలు తేడా లేకుండా నీటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు చర్యలు చేపట్టి అక్రమంగా ఏర్పాటు చేసుకున్న కొళాయిలను తొలగించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

సమస్య పరిష్కారం



దిమ్మెపై నుంచి తొలగించి ట్రాన్స్‌ఫార్మర్‌ను స్తంభానికి ఏర్పాటు చేసిన దృశ్యం

చిప్పగిరి: తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు ఎత్తులో ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించారు. స్థానిక జూనియర్ కళాశాల సమీపంలో తక్కువ ఎత్తులో దిమ్మెపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండడంతో గత మాసంలో ‘సాక్షి’ దిన పత్రికలో వార్తా కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ అధికారులు సోమవారం దిమ్మెపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడినుంచి తొలగించి ఎత్తులో స్తంభానికి బిగించారు. సమస్య పరిష్కరం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

హొళగుంద: వలంటీర్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన చర్యలతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి జీతాలు నిలిపి వేస్తామని హొళగుంద పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ హెచ్చరించారు. సోమవారం ఆయన హొళగుందలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. కొందరు వలంటీర్లు విధుల విషయంలో తమకు సహకరించడం లేదని సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. అలాగే సమావేశానికి 76 మందికి గాను 43 మంది మాత్రమే హాజరయ్యారని, గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో నిర్లక్ష్యం, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. అధికారులకు, ప్రజలకు అన్ని వేళల్లో అందుబాటులో ఉండి ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకాన్ని, సమాచారాన్ని ప్రజలకు వివరించి వారు పథకాలు పొందేలా అవగాహన కల్పించాలన్నారు. విధులకు సక్రమంగా హాజరు కాని, నిర్లక్ష్యంగా పనిచేస్తున్న వలంటీర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కౌలు కార్డుతో ప్రయోజనం

తుగ్గలి: కౌలు కార్డులతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని వ్యవసాయశాఖ మండల అధికారి పవన్‌కుమార్ అన్నారు. సోమవారం రాతన ఆర్‌బీకేలో కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. కౌలు కార్డుల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కౌలు రైతులందరూ తప్పనిసరిగా గుర్తింపు కార్డు పొందాలన్నారు. వీఆర్‌ఓ నాగేంద్ర, వీహెచ్ఏ ఎజ్జికల్, వలంటీర్లు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత ప్రచారం

వెల్దుర్తి: త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి డోన్ కమిటీ, హిందూ జ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కాశాపురం, బింగిదొడ్డి గ్రామాలలో సోమవారం త్రైత సిద్ధాంత ప్రచారం జరిగింది. ప్రచారంలో భాగంగా ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంతాల పుస్తకాలను గ్రామస్తులకు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. జ్ఞాన వేదిక డోన్ కమిటీ అధ్యక్షుడు నాగార్జున, ప్రతినిధులు నాగేంద్ర, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం

ఎమ్మిగనూరుటౌన్: మంత్రాలయం మండలం వి.తిమ్మాపురం గ్రామంలో ఏర్పాటు చేయనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థానిక మల్లెల గ్రూప్ అధినేత డాక్టర్ ఆల్‌ఫ్రెడ్‌రాజ్ రూ.60 వేల విరాళాన్ని నిర్వాహకులకు సోమవారం అందజేశారు. ఆయన నివాసంలో కలిసిన జైభీమ్ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య, నాయకులు ముత్తు సుమాల, నాగేష్, విజయ్ కుమార్ తదితరులకు అందజేయడంతో వారు ఆయన్ను సన్మానించారు. జైభీమ్ ఎంఆర్‌పీఎస్ నాయకులు దావీదు, మూర్తి, సుందర్‌రాజు, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

గోనెగండ్ల: వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు. సోమవారం ఉదయం ఆయన పోలీస్ స్టేషన్ రోడ్డులో ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్, మద్యం సేవించి వాహనం నడిపిన వారికి, వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు లేని 10 మందికి రూ.1,350 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న చలానాలు చెల్లించాలని కోరారు.

హొళగుందలో భారీ వర్షం

హొళగుంద: మండలకేంద్రంలో సోమవారం మధ్యాహ్నం, రాత్రి ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆదోని నుంచి హొళగుంద సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేసే 33 కేవీ లైన్‌కు కొన్ని గంటల పాటు సరఫరాను అధికారులు నిలిపివేశారు. ఈదురుగాలులకు మామిడికాయలు నేలరాలాయి. వీధులన్నీ జలమయమయ్యాయి.పంటల సాగు లేనందున వర్షం వల్ల పెద్ద నష్టం జరగలేదని రైతులు తెలిపారు. మామిడి రైతులు కొద్దిమేర నష్టపోయారు. విపరీతమైన ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు వర్షం కొద్దిమేర ఉపశమనం కలిగించింది.

నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలపై కొరడా



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

ఎమ్మిగనూరుటౌన్: నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తున్న దుకాణాలపై సోమవారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించి నిర్వాహకులకు జరిమానాలు విధించారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, సత్యన్నతో పాటు వార్డు సచివాలయ సిబ్బంది స్థానిక గాంధీ సర్కిల్‌లోని పలు దుకాణాలపై దాడులు చేసి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు స్వాధీనం చేసుకొని వ్యాపారులకు జరిమానాలు విధించి హెచ్చరికలు జారిచేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వ్యాపారులు విక్రయించరాదని, అలాగే వినియోగదారులు ఉపయోగించవద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టీ స్టాళ్ల వద్ద కప్పులు రోడ్లపై పారవేయరాదని శుభ్రత పాటించాలని సూచించారు. స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

వృత్తి విద్యతో స్వయం ఉపాధి



విద్యార్థులకు డీటీపీ సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రిన్సిపాల్ సాగరిక

ఎమ్మిగనూరుటౌన్: వృత్తి విద్యతో స్వయం ఉపాధి అవకాశాలు పొందవచ్చని జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ సాగరిక పేర్కొన్నారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకేవీవై) స్కిల్ హబ్ ఇన్సియేటివ్ కింద బనవాసి జవహర్ నవోదయ పాఠశాలలో 27 మంది విద్యార్థులకు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీటీపీ) కోర్సు పూర్తి కావడంతో సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కంప్యూటర్ స్కిల్స్ నేర్చుకోవడం ద్వారా స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. త్వరలో నాలుగో విడత శిక్షణ ప్రారంభమౌతుందని ఆమె పేర్కొన్నారు. పీఎంకేవీవై కో-ఆర్డినేటర్, వైస్ ప్రిన్సిపాల్ కె.చందిరన్, సూపరింటెండెంట్ యస్‌వి.ప్రసాద్, డీటీపీ కోర్స్ ట్రైనర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

తుగ్గలి: ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి కలిగిన రైతులను ప్రోత్సహిస్తున్నట్లు ఏపీడీ పద్మావతి తెలిపారు. ఆమె సోమవారం రాతనలో ఉపాధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మస్టర్ పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కొలతల ప్రకారం పనిచేస్తే రోజూ రూ.272 వేతనం అందుతుందన్నారు. ఉపాధి పథకంలో పండ్ల తోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలని కోరారు. జాబ్‌కార్డు ఉండి ఐదెకరాలలోపు పొలం కలిగిన రైతులు పండ్ల తోటల సాగు చేపట్టవచ్చని, ప్రభుత్వం మూడేళ్ల పాటు ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని రైతులు, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీఓ రామకృష్ణ, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

అక్రిడేషన్లు ఇవ్వాలి

పత్తికొండటౌన్: అర్హులైన విలేకరులందరికీ ప్రభుత్వం గుర్తింపు కార్డులు (అక్రిడేషన్లు) మంజూరు చేయాలని ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు ఎం.సాలురంగడు విజ్ఞప్తి చేశారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్రకమిటీ పిలుపు మేరకు సోమవారం పత్తికొండలో విలేకరులు ఆర్‌డీఓ మోహన్‌దాస్‌ను కలసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే నాయకులు, విలేకరులు ఉన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయండి



నందవరంలోని జెడ్పీ పాఠశాలలో నాడు- నేడు పనులను పరిశీలిస్తున్న మండల అధికారులు

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన బడి నాడు- నేడు రెండవ విడత అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులు, ఉపాధ్యాయులకు ఎంపీడీఓ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం పీఆర్ ఏఈ జయన్న ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాబార్డు ద్వారా రూ. 2.20 కోట్లు, నాడు-నేడు ద్వారా పాఠశాలలో 17 అదనపు గదుల నిర్మాణానికి రూ. 2.04 కోట్లు మంజూరయ్యాయన్నారు. పనుల్లో పురోగతి సాధించాలని ఎఫ్ఎస్ఏ ఏఈకి సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్వశిక్ష అభియాన్ ఏఈ మురళి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

నాడు-నేడుతో బడులకు మహర్దశ



సిరాలదొడ్డిలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు కార్యక్రమంతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అన్ని సదుపాయాలతో సిద్ధం అవుతున్నాయని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని సిరాలదొడ్డి గ్రామంలో నాడు-నేడు కింద చేపట్టిన పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయా పనులు సకాలంలో నాణ్యతతో పూర్తి చేసి విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలన్నీ సమకూర్చాలని అధికారులకు సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కృష్ణగిరి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కంగాటి వెంకటరామిరెడ్డి అధ్యక్షతన మంగళవారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ తెలిపారు. ప్రజా ప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

ఎమ్మిగనూరురూరల్: గొర్రెలు, మేకల యజమానులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ అశోక్‌కుమార్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని కందనాతి గ్రామంలో ప్రధానమంత్రి కృషి సంచాయోజన పథకం కింద వాటర్‌షెడ్ వారు ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేకలు, గొర్రెలకు వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గొర్రెలు, మేకలకు ఆరోగ్యం బాగలేకపోతే పశు వైద్యశాలకు తీసుకొస్తే వైద్య పరీక్షలు చేసి వ్యాక్సిన్ వేస్తామని తెలిపారు. గొర్రెలకు వ్యాక్సిన్ వేసి మందులను పంపిణీ చేశారు. వాటర్‌షెడ్ సిబ్బంది శివ, గోపాలమిత్ర నల్లన్న, పశువైద్య సిబ్బంది పవన్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



నందవరంలో కిసాన్ అగ్రిమాల్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఏ మహ్మమద్ ఖాద్రి, ఏఓ స్రవంతి

నందవరం: విత్తనాలు, ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి హెచ్చరించారు. సోమవారం నందవరంతో పాటు నాగలదిన్నె గ్రామంలోని కిసాన్ అగ్రిమాల్స్, సీడ్స్ దుకాణాలను ఏఓ మత్రి స్రవంతితో కలిసి తనిఖీ చేశారు. స్టాకు రికార్డులు, విత్తనాల తనిఖీ చేపట్టారు. ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల నుంచి రబీ సీజన్ ప్రారంభమవుతుందని రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు విక్రయించే ఉత్పత్తులకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని దుకాణాదారులకు సూచించారు. మే నెలలో అధిక ఉష్ణోగ్రతతో విత్తన మొలక శాతం తగ్గి, ఆకులు ఎర్రబడి రైతులకు నష్టం జరుగుతుందని, జూన్ నెలలో విత్తనాలు నాటుకుంటే మంచిదని రైతులకు సూచించారు. ఏఈఓ సురేంద్రగౌడ్ ఉన్నారు.

పిడుగుపాటుకు ఎద్దు, ఆవు మృతి



పోతుగల్లులో పిడుగుపాటుకు మృతి చెందిన ఎద్దు, ఆవు

కృష్ణగిరి: పిడుగుపాటుకు ఎద్దు, ఆవు మృతి చెందాయి. పోతుగల్లు గ్రామానికి చెందిన కిందింటి వెంకటేశ్వర్లు, చంద్రన్నలకు చెందిన మూడు ఎద్దులు, ఆవును ఇంటి సమీపంలోని వామిదొడ్డిలో కట్టేశారు. సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగుపాటుకు గురై వెంకటేశ్వర్లుకు చెందిన ఎద్దు, చంద్రన్న ఆవు మృతి చెందగా మరో రెండు ఎద్దులు తప్పించుకున్నాయి. రూ.1.20 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు విలపించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన ఉశేన్‌సా (ఫైల్)

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని కనకదిన్నె గ్రామ సమీపంలో బైక్‌పై వెళ్తుండగా అకస్మాత్తుగా జింక అడ్డు రావడంతో జరిగిన ప్రమాదంలో పత్తికొండకు చెందిన కార్పెంటర్ తెర్నేకల్ ఉశేన్‌సా (51) దుర్మరణం చెందాడు. వివరాలు.. పత్తికొండ నుంచి దేవనకొండ మండలం పుల్లాపురం గ్రామంలో కార్పెంటర్ పని నిమిత్తం ఉశేన్‌సా, మరో కార్పెంటర్ మక్తుంతో కలిసి బైక్‌పై బయల్దేరారు. మార్గం మధ్యలో కనకదిన్నె గ్రామ సమీపంలో వెళ్తుండగా అకస్మాత్తుగా జింక రోడ్డుకు అడ్డంగా వచ్చి బైక్‌ను తగిలింది. బైక్ అదుపుతప్పి కింద పడడంతో ఉశేని అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు సంతానం. గాయపడిన మక్తుం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతదేహాన్ని చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేపు వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ

తుగ్గలి: మండల పరిధిలోని పగిడిరాయిలో బుధవారం వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నారు. దాతలు, వాల్మీకుల సహకారంతో గ్రామంలో నూతనంగా ఆలయం నిర్మించారు. ప్రతిష్ఠ కార్యక్రమానికి వాల్మీకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని గ్రామస్తులు కోరారు.